కథ


# ఇందిరమ్మ

–పెయ్యేటి శ్రీదేవి

ఇందిర ఇల్లంతా కంగారుగా వెతికేస్తోంది. గొలుసు కొత్తగా చేయించుకుంది. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ దేవికి పూజ చేసి ఆ సాయంత్రం అమ్మవారి నుంచి తీసి మెడలో వేసుకుంది. పట్టు చీర కట్టుకుని గుడికి కూడా వెళ్ళింది, నిన్న కూడా మెడలోనే వుంది. తనకి బాగా గుర్తు. పక్కింటి పార్వతమ్మ గారు కూడా గొలుసు చూసి 'చాలా బాగుందమ్మా ఇందిరా! నేనూ చేయించుకుంటాను' అంది.

ఆవిడ చూసి ఇచ్చేసింది. వెంటనే మెడలో వేసుకుంది. రెండు పేటల చంద్రహారం. భర్తకి అరియర్స్ వస్తే ఆ డబ్బుతో ఎంతో ఇష్టపడి చేయించుకుంది. మెడలోంచి తీసిన గుర్తూ లేదు. ఈరోజు ఉదయం నిద్ర లేవగానే మంగళసూత్రాలు కళ్ళకద్దుకునేటప్పుడు కూడా చంద్రహారం మెడలోనే వుంది. బాగా గుర్తు. మరేమై వుంటుంది? బుర్రంతా అయోమయమైంది గానీ ఏమీ గుర్తు రావడం లేదు. పని మనిషేమన్నా తీసుండవచ్చా? రెండేళ్ళ నుంచీ చేస్తోంది ఆ అమ్మాయి. ఇంత వరకూ ఏమీ పోలేదు. అలాగని నమ్మడానికీ లేదు ఈ పనివాళ్ళని. తీసినా తీసి వుండవచ్చు. ఎప్పుడన్నా ఇల్లు వూడుస్తున్నప్పుడు చిల్లర డబ్బులు దొరికితే నమ్మకం కలిగించడానికి తీసి ఇస్తుంది కానీ ఇప్పుడు పోయింది పెద్ద వస్తువు. తీసి వుండవచ్చుగా! ఎందుకంటే దొంగతనం చేసేవాళ్ళే నీతి వాక్యాలు మరింత ఎక్కువగా చెప్పి ప్రమాణాలు కూడా చేస్తారు. తను ఇప్పుడెలాగూ పనికి పక్క ఇళ్ళకి వస్తుంది కాబట్టి నిలబెట్టి అడిగేయాలి. అమ్మో! ఇప్పుడు నువ్వే తీశావని గదమాయిస్తే అర్థం కాని యాసలో తిట్టిన తిట్టు తిట్టడమే కాక, వూరూ, వాడా యాగీ చేస్తుంది. ఇప్పుడు పనిమనిషి మానేస్తే ఇంటెడు చాకిరీ చేసుకోవడం కష్టం. మరి చంద్రహారం ఎలా పోయింది? సందేహం లేదు. పనమ్మాయి పనే. కానీ ఎలా తీస్తుంది? తను తీసి ఎక్కడా పెట్టలేదు కదా! బుర్రంతా గజిబిజిగా వుంది. ఏదీ గుర్తుకు రావడం లేదు. మళ్ళీ ఇల్లంతా వెతికేస్తోంది. అలమరాలో బట్టలు, పుస్తకాలూ అన్నీ కింద పడేస్తోంది. కళ్ళ వెంబడి నీళ్ళొస్తున్నాయి. టెన్షన్ పెరిగిపోతోంది.

బట్టల బీరువా కూడా చూద్దామని కంగారులో విసురుగా లాగింది. అసలే దానికి హ్యాండిల్ లూజ్‌గా వుండటంతో అది చేతిలోకి వూడొచ్చి కింద పడింది. పైనున్న సూట్‌కేస్ ధామ్మని కిందపడింది. అసలే పాత సూట్ కేసు. మూత విడిపడి అందులోంచి ఒక ప్యాకెట్ ఒకటి బయటపడింది. ప్లాస్టిక్ కవర్ అది. అందులో బాగా ఎండిపోయిన పూలదండ దర్శనమిచ్చింది. ఆ సూట్ కేస్ ఎప్పట్నుంచో ఆ పాత బీరువా మీదుంది. 'ఈ పాతిల్లు అమ్మేసి కొత్తిల్లు కట్టుకుందామండీ' అని ఎంత చెప్పినా 'ఊహూ! ఇది అమ్మా నాన్నగారు కష్టపడి కట్టించిన ఇల్లు. అచ్చొచ్చిన ఇల్లు' అంటూ సెంటిమెంటు పాస్ చేశారు. ఆయనతో ఇంకేమన లేక పెళ్ళయి వచ్చిన నాటి నుంచి అత్తమామలు కట్టించిన అదే పాతింటిలో వుండటం కాబట్టి, ఆ పాత బీరువా మీద ఆ పాత సూట్‌కేసు తీసే అవసరమూ రాలేదు. ఆ బీరువాని పాత సామాన్ల వాడికి ఏదో రేటుకి పడేసి కొత్తది కొందామన్నా భర్త రాఘవేంద్ర రావుకి పాత మీద వుండే అభిమానం వల్ల అదీ కుదరలేదు. ఆ పాత సంగ



తొదిలేసి కొత్త గొలుసు వెదుకుదామంటే భద్రంగా ప్యాక్ చేసివున్న ఈ వూలదండ బయట పడింది. ఈ వూలదండ సూట్‌కేసులో ఎందుకుందో అర్థం కాలేదు. కాని ప్రస్తుతం ఆ ప్యాకెట్ గురించి ఆలోచించే స్థితిలో లేదు తను.

మళ్ళీ గొలుసు వెతకడం మొదలెట్టింది. బీరు వాలో బట్టలన్నీ తీసింది. ఎక్కడా లేదు. ఈలోగా పనమ్మాయి వచ్చింది ఇల్లు వూడవడానికి.

"ఏంటమ్మా! ఇల్లంతా ఇట్లాగుంది? ఏమన్నా పోవాదా?"

"అవును యాదమ్మా! గొలుసు కనిపించడం లేదు. కొంచెం ఈ బట్టలన్నీ మడతపెట్టి, పుస్తకాలు అలమారాలో పెట్టి సర్ది చూడు".

"నీ కాల్మొక్త! అయన్నీ చెయ్యటానికి నాక్కాద ర్దమ్మా! నువ్వే సదురుకో! నేనీ పనన్నీ ఒవ్వకున్నావా? ఇంక మూడిండ్లున్నయ్! జల్దిబోవాల! నా బిడ్డకి సర్దయింది. దవాఖానకు తోల్కపోవాల! మల్లొచ్చి నల్లాకాడ నీళ్ళు బట్కోవాల! బట్టలు మల్లొచ్చి పిండుత. తుడవనిక అచ్చిన! తుడిచేసి పోత" అంటూ తుడవటం మొదలెట్టింది. ఆ వూల వూల ప్యాకెట్ కూడా తుడువులోకి వెళ్ళిపోయింది. ఇంతలో కింద పాకుతూ వస్తున్న ఇందిర కూతురు తొమ్మిది నెలల పాప ప్రశాంతి ఆ ప్యాకెట్ తీసు కుని ఆడుతోంది. మళ్ళీ ఆ ప్యాకెట్ పనమ్మాయి తుడువులోకి వెళ్ళిపోయింది.

ఈలోగా ఇందిర భర్త రాఘవేంద్ర అప్పుడే బైట నుంచి వస్తూ ఆ వూల ప్యాకెట్ చూసి తీద్దామను కునే లోగా వూడ్చిన చెత్తతో పాటు ఆ ప్యాకెట్‌ను కూడా చెత్తబుట్టలో వేసింది పనమ్మాయి. రాఘ వేంద్ర దాన్ని తీద్దామనుకునే లోగానే చెత్తబండి వాడు స్వీడందుకున్నాడు. దాని వెంట పడ్డాడు రాఘవేంద్ర. చెత్త కోసం మళ్ళీ ఒకింటి వద్ద ఆపాడు బండిని చెత్తవాడు. అతడు తిరిగొచ్చే లోపే రాఘవేంద్ర అందులోని వూలదండ ప్యాకెట్ తీసుకున్నాడు. ఇంతలో బండివాడు వచ్చి వింతగా చూస్తూ–

"ఏందయ్యా! ఆ ఎండిపోయిన వూలదండ ప్యాకెట్ తీసుకున్నారూ! ఎందుకయ్యా అది మీకూ!" అని అడిగాడు. దానికి సమాధానం చెప్పకుండా ఇంటికొచ్చి ఇందిర మీద విరుచుకుపడ్డాడు రాఘ వేంద్ర.

"ఆ వూలదండ ప్యాకెట్ ఎందుకు తీశావు? అసలా సూట్‌కేస్ తీయాల్సిన అవసరం ఏమిటి? నామీద నీకెందుకంత అనుమానం? అసలు నా వస్తువులు ముట్టుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది? ఇల్లు సర్దడం అంటే ఇదా? ఆ ప్యాకెట్ పడేయాల్సిన అవసరం నీకేమొచ్చింది?"

ఇందిర ఓమూల తన గొలుసు పోయిందన్న బాధలో వుంటే, ఆ ఎండిపోయిన వూలదండ ప్యాకెట్ గురించి దుర్వాస మునిలా అంత కోపంతో భర్త తన మీద ఎందుకంత గావుకేకలు పెడు తున్నాడో ఎంతకీ అర్థం కాలేదు. తెల్లబోయి చూస్తోంది. ఎప్పుడూ దేవుని పూజకి గానీ, తల్లో పెట్టుకోవడానికి గాని ఎన్ని సార్లు వూలు కొని తెమ్మని అడిగినా 'నాకు పువ్వులంటే ఎలర్జీ, నాకా వాసనే పడదు, నువ్వెళ్ళి కొనుక్కో' అనే భర్త ఆ ఎండిపోయిన వూలదండ ప్యాకెట్ ఆ పాత సూట్‌కేస్‌లో ఎన్నేళ్ళ నుంచో అంత భద్రంగా ఎందుకు దాచాడో, అది చెత్తలకి వెళ్ళిపోతే చెత్త బండి వెంటపడి తీసుకుని అది పారేసినందుకు తనమీద ఎందుకంతలా విరుచుకుపడుతున్నాడో అర్థం కావట్లేదు ఇందిరకి.

"ఏమిటలా దెయ్యం మొహం పెట్టుకు నిలబడ్డావ్ సమాధానం చెప్పకుండా! నీ మొహాన ఎంత డబ్బు కావాలంటే అంత డబ్బూ పారేస్తున్నాగా. మళ్ళీ నా వస్తువులు వెతకడమెందుకు?"

"ఆపండి మీ అరుపులు! ఇంత చిన్న విషయానికే అంతగా కేకలు పెట్టాలా? పూవులు తెమ్మంటే ఏనాడూ కొని తేరు. పూవులంటే అలర్జీ అనే మీరు ఆ ఎండిపోయిన వూల ప్యాకెట్ గురించి అంత కోపంగా అరవాల్సిన అవసరం ఏమిటి? విషయం ఏమిటో చెప్పొచ్చుగా! నేనేం ఆరాల గురించి మీమీద అనుమానంతో ఆ సూట్‌కేస్ తీయలేదు. డబ్బుల గురించీ కాదు. నా చంద్రహారం కనిపించక ఇల్లంతా వెతుకుతూ బీరువా గట్టిగా లాగడంతో ఆ కుదు పుకి పెట్టె కిందపడ్డంతో వూల ప్యాకెట్ బయట పడింది. ఎండిన ఆ వూల ప్యాకెట్ ఎందుకు దాచారో నాకు తెలియలేదు. దాని అవసరం ఏముందిలే! అనుకున్నాను. పనమ్మాయి తుడు స్తుంటే దాని గురించి పట్టించుకోలేదు. అసలా వూల ప్యాకెట్ గురించి ఇంత రాద్ధాంతం చేస్తున్నా రేమిటి? నెమ్మదిగా విషయం ఏమిటో చెప్పొచ్చుగా! మీ ఆఫీసుతో టైపిస్టు ఉమతో ఫోను చేసి మాట్లాడినా, మరో అమ్మాయి నీలిమ ఇంటికి వస్తే ఆమెతో ఎంత నవ్వుతూ మీరు కబుర్లాడినా ఏనాడన్నా అనుమానించానా? ఒక ఆడ, ఒక మగ మాట్లాడుకుంటేనే అనుమానించేంతంత నీచ స్వభావం నాకు లేదు. ఒక వేళ మీకు వేరే ఉద్దేశాలున్నా నేను పట్టించుకోను. అలాంటిది ఈ వూల ప్యాకెట్ గురించి తెలుగు సినిమాల్లోలాగా, తెలుగు నవలల్లోలాగా అనవసరపు అనుమానా లతో, అపార్థాలతో మన సంసారంలో చిక్కులూ, కలతలూ రావడం మంచిది కాదు. దాని గురించి నా బుర్ర పాడుచేసుకోదల్చుకోలేదు. ఇంత గొడవ జరిగాక వూరుకోవడమూ అంత మంచిది కాదు.




ఆ పూల ప్యాకెట్ కథను నిజాయితీగా చెప్పండి. ఆ ఎండిన పూలదండ అంత చక్కగా ప్యాక్‌చేసి ఎందుకు దాచుకున్నారు? దీనిక్కారణం ఏమిటి?"

"పదిహేను సంవత్సరాల క్రితం భువనేశ్వర్‌కు ఆఫీసు పనిమీద నాలుగు నెల్లు ట్రైనింగ్‌కు వెళ్ళాను. నా పనితనం చూసి ప్రమోషన్ కూడా వచ్చింది. ఆరోజే బయల్దేరి హైదరాబాద్ వచ్చేద్దామనుకున్నాను. మా నాన్నగారు పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నారు. నాకప్పుడే వివాహం చేసుకోవాలని లేదు. భువనేశ్వర్‌లో ఓ సంబంధం వుంది. అడ్రస్ చెప్పి అమ్మాయిని చూసి రమ్మన్నారు. కానీ ఆరోజు సంబంధం చూడ్డానికి వెళ్ళలేదు. ఆరోజే అప్పటి ప్రధాని ఇందిరా గాంధి వస్తోందన్నారు. ఏమైనా సరే ఆవిడ్ని చూడాలనుకున్నాను. హైదరాబాద్ ప్రయాణం కాన్సిల్ చేసుకుని ఇందిరా గాంధీని చూడ్డానికి వెళ్ళాను. ఇసకేస్తే రాలనంతగా జన సందోహం. అందరూ ఆ దేవతని చూడ్డానికి బారులు తీరి నిల్చున్నారు. నేను ఆ జనం లోంచి ఇరుక్కుంటూ వెళ్ళి దొరికిన ఖాళీ జాగాలో సెటిలయ్యాను. అందరూ ఆవిడ్ని చూడాలన్న ఉత్సాహంలో ఉద్వేగంగా వున్నారు. ఇంతలో ఆ అమ్మ వచ్చింది. ఆవిడకి జేకొడుతూ నినాదాలు చేస్తున్నారు. ఆవిడమీద పూలవర్షం కురిపిస్తున్నారు. ఆవిడా ఎంతో ఉత్సాహంతో ఆ దండలను అందరి మీదా విసురుతోంది. ఆమె నేనున్న చోటికి వచ్చింది. దగ్గర నుంచి చూశాను. చేతులెత్తి నమస్కారం చేశాను. ఆవిడ విసిరిన పూలదండ నామీద పడింది. నాకు చాలా ఆనందం వేసింది. ఆవిడ్ని చూడటమంటే ఒక దేవతని చూడటమేనని భావించాను. ఆ దేవత చేతులతో నా మీదికి విసిరిన పూలదండ అది. మాటల్లో చెప్పలేను. అదో దివ్యానుభూతి. ఆ చేమంతి పూలదండని ఎంతో అపురూపంగా ప్లాస్టిక్ కవర్లో పెట్టి పిన్ చేసి ఈ సూట్‌కేస్‌లోనే భద్రపర్చాను. ఆ మర్నాడే ఫ్లైట్‌లో హైదరాబాద్ చేరుకున్నాను. క్రితం రోజు పొందిన ఆనందం ఎంతో సేపు నిలవలేదు. ఇంటికి చేరుకున్నానో లేదో భయంకరమైన విషాద వార్త. దేశం యావత్తూ విలపించింది. ప్రపంచమంతా దిగ్భ్రాంతి చెందింది. ఇందిరా గాంధీ ఆవిడ సెక్యూరిటీ గార్డుల చేతిలోనే దారుణ హత్యకు గురయ్యారు. నేనే కాదు. ఆవిడ మరణ వార్త విని ఎవ్వరూ తట్టుకోలేకపోయారు. ఆ దేవత నామీద విసిరిన పూలదండే ఇది. అప్పుడు ప్రయాణంలో తీసికెళ్ళిన సూట్‌కేస్ ఇది. అప్పట్నుంచీ ఎంతో అపురూపంగా దాచుకున్నాను" అంటూ చమర్చిన కళ్ళను తుడుచుకున్నాడు రాఘవేంద్ర.

భర్త చెప్పింది విని ఇందిరకి కళ్ళు చమర్చాయి. భర్త చేతిలోని పూలప్యాకెట్ తీసుకుని తడి బట్టతో శుభ్రంగా తుడిచి కళ్ళకద్దుకుని సూట్‌కేస్‌లోనే వుంచి దాన్ని బీరువా మీద పెట్టింది.



## సన్నిడియోల్ రూటే వేరు

తాను నటించిన సినిమాల జయాపజయాలు ఎలా ఉన్నా తనను నమ్ముకున్న డింపుల్ కపాడియాతో సంబంధాన్ని మాత్రం గడచిన 15 ఏళ్ళుగా బాగానే మెయిన్‌టెయిన్ చేస్తున్నాడు సన్నీడియోల్. పెళ్ళి చేసుకుని లేని పోని తల నెప్పి నెత్తి కెక్కించుకోవడం కంటే ఇదే బాగుందనుకుని కంటిన్యూ అయిపోతోంది డింపుల్.

"మీరెంత అదృష్టవంతులండీ! ఆ దేవతని కనులారా చూశారు. మా ఇంట్లో అందరికీ ఇందిరమ్మ అంటే చాలా ఇష్టం. మా తాతగారికి గాంధీ గారు, నెహ్రూ గారితో పరిచయాలున్నాయి. ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు. నేను ఇందిరమ్మ పుట్టిన రోజునే పుట్టాను. మా నాన్నగారు ఆవిడ మీద అభిమానంతో అందుకే నాకు ఇందిర పేరు పెట్టారు. మేమూ అప్పుడు భువనేశ్వర్‌లోనే వున్నాము. ఆవిడ్ని చూడాలని ఎంతగానో ఆశపడ్డాను. ఆరోజు పెళ్ళివారొస్తారంటూ కదలనివ్వలేదు. ఆఖరికి వాళ్ళు రాలేదు. ఆ పెళ్ళికొడుకు హైదరాబాద్ వెళ్ళిపోయాడని తెలిసింది. అందుకే ఆ రాని పెళ్ళికొడుకు మీద కోపం వచ్చి నేను ఇప్పట్లో పెళ్ళి చేసుకోనని, ఇంకా చదువుకుంటాననీ అప్పుడు పట్టుబట్టాను. ఈలోగా మా నాన్నగారికి హైదరాబాద్ ట్రాన్స్‌ఫరై వచ్చాము. నా పి.జి. పూర్తయ్యాక నాన్నగారు మళ్ళీ పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నారు. అనుకోకుండా హైదరాబాద్‌లో సంబంధమే సెటిలయ్యింది" అంటూ చెప్పుకుపోతోంది ఇందిర. ఇంతలో ఏదో సందేహం వచ్చి ఆగి–

"అవునూ భువనేశ్వర్‌లో మీరు కలవాలనుకున్న అమ్మాయి వాళ్ళ అడ్రస్ మరోసారి చెప్పండీ!" అంది.

చెప్పాడు రాఘవేంద్రరావు.

ఆశ్చర్యపోతూ "ఏమండీ! అడ్రస్ మాదే. మీరు చూద్దామనుకున్న అమ్మాయిని నేనే. ఎంత విచిత్రం! అనుకోకుండా మనకి వివాహం కావడం! 'మేరేజస్ ఆర్ మేడిన్ హెవెన్' అన్నారు ఇందుకేనేమో! అంటే పెళ్ళి చూపులకి మీరు ఆరోజు రాలేదని, ఆ కారణంగా ఇందిరమ్మని చూడటం కుదరలేదని నేను కోపం పెంచుకుని, ఆ పెళ్ళికొడుకు తమరేనన్నమాట! అయితే ఇవాళ మన జీవితంలో ఓ కొత్త విషయం బయట పడిందన్నమాట!"

ఇంతలో "అమ్మా! పాపం ఇందాకట్నించీ ఎతుకుతుండారు గొలుసు కోసం. లేని చోట ఎతికితే ఎక్కడ కనిపిస్తుందమ్మా! ఉన్న పోట ఎతకాలి గానీ...బాత్రూమ్‌లో బట్టలుతుక్కడాన్కి నల్లా గొట్టానికి పెట్టిన బట్టలు తీసినానమ్మా!! ఈ గొలుసు నల్లా గొట్టానికి ఏలాడుతోందమ్మా! దానిమీద బట్టలు తీసినానమ్మా! ఈ గొలుసు దానికి ఎలాడుతోందమ్మా! మీరు దానిమీద బట్టలేసినారు. ఎలా కనపడుద్దీ! ఇదిగోమ్మా గొలుసు! ఇయాల మీరోజు కాదు వారోజు బాగుండాది. ఎంత పరేషాన్‌గుందో మీరా ఇసయం సెప్పినకాడ్నుంచి! లేకపోతే అనుమానం పది రకాలుగా పోతది. వత్తనమ్మా! గొలుసు భద్రమమ్మా!" అంటూ యాదమ్మ చంద్రహారం చేతిలో పెట్టింది. ఇందిర మనసు గాల్లో తేలి పోతుంటే రాఘవేంద్ర ఏభై రూపాయిలు పనమ్మాయి చేతిలో పెట్టాడు.

అవునూ! అప్పట్టు అక్కడ కుళాయి గొట్టానికెందుకుంది గొలుసు? స్నానం చేయించేటప్పుడు పాపాయి ప్రశాంతి తన మెడలో గొలుసు లాగి అల్లరి చేస్తోంటే తాను దాన్ని తీసి గొట్టానికి తగిలించింది. దానిమీదే పాపాయి బట్టలు, తర్వాత చీర, తుండు పెట్టింది. ఇప్పుడు గుర్తొస్తోంది అంతా. పనమ్మాయి మీద ఎంత అపోహపడింది? పాపం మంచిది కాబట్టి ఇచ్చింది. ఇంకొకళ్ళయితే ఇచ్చేవారే కాదు. తల్చుకుంటే ఆరోజంతా తమాషాగా జరిగిపోయింది. గొలుసు కనిపించక ఇల్లంతా వెదికి చిందరవందరగా అన్నీ పడేయటం, పూలప్యాకెట్ కింద పడటం, అది ఇందిరా గాంధీ విసిరేసిన పూలదండ అని తెలవడం, భువనేశ్వర్‌లో తనని భంగపాటుకు గురిచేసి డుమ్మా కొట్టిన పెళ్ళికొడుకు ఈయనేనని, తాను కోపం పెంచుకుని శపథాలు చేయడానికి కారణమైన ఆయనతోటే తన వివాహం జరిగిందన్న విషయాలు బయట పడటం.... అంతా విచిత్రంగా అనిపించి ఆ మధురస్మృతులను మననం చేసుకుంటూ, భర్త తిట్టిన తిట్లు మర్చిపోయి ఇందిర హాయిగా నవ్వేస్తోంది. ఆమె నవ్వుతో భర్త రాఘవేంద్ర రావు కూడా శృతి కలిపాడు.

అమ్మా నాన్నల నవ్వులకర్థం తెలీకపోయినా పాపాయి కూడా నవ్వేస్తోంది.